# బులంద్ షహర్ హిందూమతతత్వ ఫాశిస్టు మూకల మరో ఘాతుక హత్య

**2014లో** కేంద్రంలో బిజెపి అధికారం లోకి వచ్చినప్పటినుండి, హిందూమతతత్వ ఫాశిస్టు మూకల దౌర్జన్యాలు, దాడులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ప్రత్యేకించి బిజెపి పాలిత రాష్ట్రాలలో ఈ హిందూమతతత్వ ఫాశిస్టు గూండాల బెదిరింపులు, దాడులు, హత్యలు ప్రమాదకరంగా పెరిగిపోతూ సమాజాన్నే భయభ్రాంతుల్ని చేస్తున్నాయి. బిజెపి పాలకుల పరోక్ష అండదండలతో చట్టభీతి లేకుండా ఈ మూకలు చెలరేగిపోతున్నాయి.

గోసంరక్షక నిఘా బృందాల ముసుగులో ఈ గూండాలు బీభత్సం సృష్టిస్తూ, మతతత్వాన్ని, మతవిద్వేషాల్ని పెంపొందించి వ్యాప్తిచేస్తూ సామాజిక పొందికను ఛిన్నాభిన్నం చేస్తున్నారు. ఈ హిందూమతతత్వ ఫాశిస్టుశక్తుల భావనలో ఒక ఆవు ప్రాణమే మానవుల ప్రాణంకంటే ప్రాధాన్యత కలిగి వుంది. ఆవు పవిత్రతగా చెప్పబడేదానిని గురించి బోధిస్తూ, ఈ హిందూ మతతత్వ ఫాశిస్టు మూకలు, తమ ప్రత్యర్థులుగా ఎవరినైతే భావిస్తున్నారో వారిపై హింసను రెచ్చగొడుతున్నారు.

విహెచ్‌పి, భజరంగ్‌దళ్, రామ్‌సేన, హిందూ యువవాహిని మరికొన్ని సంస్థల పేరున ప్రజలపై దాడులు, హత్యాకాండ సాగిస్తుండగా, ప్రభుత్వాధికారంలోనున్న బిజెపి ఈ చర్యలను ప్రోత్సహిస్తున్నది.

ప్రజలు తమ న్యాయమైన సమస్యలను ముందుబెట్టి, శాంతియుతంగా నిరసన సాగిస్తున్నప్పటికీ శాంతిభద్రతల పరిరక్షణ సాకుతో వారిపై క్రూరంగా విరుచుకుపడి అణచివేతకు పాల్పడే ప్రభుత్వాలు, పోలీసులు; బూటకపు ఎదురుకాల్పులలో నిర్దాక్షిణ్యంగా అమాయకులను తీసుకెళ్ళి కాల్చి చంపే పోలీసులు; తమపై రాళ్ళురువ్వారనే సాకుతో జమ్ముకాశ్మీర్‌లో నిరసన తెలుపుతున్న యువజనులపై కాల్పులు జరపగలిగే పోలీసులు–ఈ హిందూమతతత్వ ఫాశిస్టు మూకలు – ప్రజలపైనేగాక తమపై కూడా దాడులకు పాల్పడుతున్నా చేష్టలుడిగి నిస్సహాయంగా మిగిలిపోయినట్లున్నారు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం – బులంద్ షహర్ జిల్లాలోని సియానా గ్రామంలో 2018 డిసెంబర్ 3వ తేదీన ఈ అదుపులేని హిందూమతతత్వ ఫాశిస్టుమూకలు గ్రామంలోని పోలీస్‌స్టేషన్‌పైనే దాడికి పాల్పడి సుబోధ్‌కుమార్ సింగ్ అనే స్టేషన్‌హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)ను, మరో యువకుడిని కాల్చి చంపారు; పోలీసు వాహనాలను తగులబెట్టారు. భజరంగ్‌దళ్‌చే ప్రేరేపితమైన ఈ మూక వాస్తవానికి ఎస్‌హెచ్‌ఓను వేటాడి మట్టుబెట్టారు. ఆ ఇన్‌స్పెక్టర్ తలలో గురిచూసి పేల్చటమే గాకుండా, రాళ్ళతో కూడా కొట్టి చంపారు.

2015లో హిందూమతతత్వ శక్తులైన భజరంగ్‌దళ్ మరియు ఇతర స్థానిక హిందూ మతతత్వ మూకలు సాగించిన భయంకరమైన అక్‌లాగ్ హత్యకేసును దర్యాప్తు చేస్తున్న ఈ ఎస్‌హెచ్‌ఓనే ఇప్పుడు వీరు లక్ష్యంగా చేసుకొని హత్యగావించారు. ఈ ఎస్‌హెచ్‌ఓను చంపటానికి ఉద్దేశించే వీరు ఈ బీభత్సాన్ని సృష్టించి దాడి సాగించారనేది స్పష్టం.

అయితే, యుపి ముఖ్యమంత్రి చాలా తాపీగా దీనినొక 'యాదృచ్ఛిక ఘటన'గా ప్రకటించాడు. ఉత్తరప్రదేశ్ పోలీసుశాఖ ఉన్నతాధికారి మాట్లాడుతూ హిందూమతతత్వ సమూహాలకు వ్యతిరేకంగా దీనిని ఒక "కుట్ర"గా పేర్కొంటూ, దీనిపై దర్యాప్తు చేస్తామని చెబుతూ ఈ ఘోరమైన ఘటననుండి దృష్టిమళ్ళించే ప్రయత్నం చేశాడు.

ఈవిధంగా, పోలీసుల "నైతిక ధృతి" గురించి ఎల్లప్పుడూ మాట్లాడుతూవుండే పాలకులు, పోలీసు ఉన్నతాధికారులు ఈసారి హిందూమతతత్వ ఫాశిస్టు మూకలవైపే నిలబడటానికి నిశ్చయించుకొని, బాధితులైన పోలీసు అధికారులను, పోలీసులను పక్కన బెట్టటానికి సిద్ధపడటంద్వారా పాలకులు సేవ చేయటానికే పోలీసు వ్యవస్థ వుద్దేశించబడిందనే తమ నిజవర్గ స్వభావాన్ని వెల్లడిచేసుకున్నారు. ప్రభుత్వాధికారంలో నున్న పాలకపార్టీ ప్రయోజనాల అంశం ముందుకొస్తే, దానికే అధిక ప్రాధాన్యతనిస్తారు మినహా, పోలీసుల నైతికధృతి అనే మాటలన్నీ హుళక్కేనని స్పష్టమౌతోంది. సామూహిక హింసాకాండలో ఎస్‌హెచ్‌ఓ సింగ్ హత్యగావించబడటానికి రెండురోజుల ముందు, తమ మతపరమైన వేడుకలకు ఎస్‌హెచ్‌ఓ ఆటంకాలు కల్పిస్తున్నాడని, అతని ప్రవర్తన హిందూమతస్థులలో ఆగ్రహాన్ని కల్గించిందని ఆరోపణలు చేస్తూ, కనుక ఎస్‌హెచ్‌ఓను అక్కడినుండి బదిలీ చేయవలసిందిగా స్థానిక బిజెపి నాయకులు డిమాండ్ చేసినట్లుగా సాక్ష్యాలు స్పష్టంగా సూచిస్తున్నాయి.

మతతత్వ చిచ్చురగల్చటంలో ప్రధాన పాత్రధారి అయిన స్థానిక భజరంగ్‌దళ్ కన్వీనర్ యోగేష్ రాజ్‌సింగ్‌ను అరెస్టు చేయకుండా పారిపోవటానికి అవకాశం కల్పించారు. ఎస్‌హెచ్‌ఓను హతమార్చిన దుండగులు ఆ ఘటనతోసహా, వాహనాలను తగులబెట్టటాన్ని అంతా వీడియోలో చిత్రీకరించారు కూడా!

గ్రామంనుండి కన్నుగప్పి తప్పుకున్న భజరంగ్‌దళ్ కన్వీనర్ 25 సం॥ల యోగేష్‌రాజ్, ఫేస్‌బుక్ వేదికగా తన 'హిందూగిరి' చర్యలను, ఎస్‌హెచ్‌ఓపై దాడి ఘటన దృశ్యాలను వుంచటంతోపాటుగా, హత్యగావించిన పోలీస్ అధికారిని నిందిస్తూ రాతలు కూడా రాశాడు.

ఆ ఎస్‌హెచ్‌ఓ హిందువుల వేడుకలకు అనేక ఆటంకాలను కల్గించటం వలననే "హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని" పేర్కొంటూ ఎస్‌హెచ్‌ఓ హత్యకు సమర్ధనగా బిజెపికి చెందిన పార్లమెంటు సభ్యులు మాట్లాడి, హిందూమతతత్వ ఫాశిస్టు మూకను వెనుకేసు కొచ్చారు.

ఈవిధంగా బిజెపి పాలకులు హిందూ మతతత్వ ఫాశిస్టు మూకలకు మద్దతుగా నిలవటమేగాకుండా, ఇతర ప్రత్యర్ధులపై దాడులకు వారిని పరోక్షంగా ఎగదోస్తూ, ప్రోత్సహిస్తున్నారని అర్ధమౌతోంది.

ప్రజలపట్ల తన సహజ వ్యతిరేక స్వభావంతో వ్యవహరించే ఓ పోలీసు అధికారే ఈసారి హత్యకు గురైవుండవచ్చు; అయినా, ఈ ఘటనపై మౌనంగా వుండిపోవటాన్ని అనుమ తించనీయరాదు లేదా ఈ చర్య ఆమోద యోగ్యంకాదు.

ఈ ఘటన–హిందూమతతత్వ ఫాశిస్టు మూకలు నిస్సిగ్గుగా సాగించే దుర్మార్గాల గురించి, అలాగే ముఖ్యంగా ప్రజానీకం ముందు ప్రధానంగా పొంచివున్న ప్రమాదం గురించి వెల్లడిచేస్తోంది.

సమాజం ఈ సంఘటనను కేవలం ఖండించటంతో సరిపెట్టటం గాకుండా హిందూమతతత్వ ఫాశిస్టుశక్తుల దాడులకు వ్యతిరేకంగా సంసిద్ధంగా, ఐక్యంగా, స్వీయ రక్షణకోసం నిలబడాలి.

ఈ తరహా దాడులపట్ల ప్రజలు ఎల్లవేళలా అప్రమత్తంగా వుండటంతోపాటు, దీనికి తగు విధంగా జవాబు ఇవ్వటానికి సంసిద్ధం కావాలి.

ooooo